## కథ

# ఒక దెబ్బకు రెండు పిట్టలు

వాణిశ్రీ




''సార్! మీకోసం ఎవరో అమ్మాయి వెయిట్ చేస్తోంది.'' చెప్పాడు సెంట్రీ.

''రమ్మను'' అన్నాడు ఇన్స్‌పెక్టర్ సలీంఖాన్.

''నమస్తే సార్! నా పేరు అన్నపూర్ణ'' అన్నది ఆమె.

ఇన్స్‌పెక్టర్ ఆమెను పరీక్షగా చూశాడు. ఆమెకు ఇరవై ఏళ్లు వుండొచ్చు. మెడలో మంగళసూత్రాలు లేవు. అంటే అవివాహిత అన్నమాట. ఒంటరిగా పోలీస్ స్టేషన్‌కొచ్చిందంటే ఆమెకు ఏదో సీరియస్ ప్రాబ్లమ్ ఎదురై వుండొచ్చు అనుకున్నాడు.

''కూర్చో!'' అన్నాడు.

ఆమె సంకోచిస్తూ వుంటే ''ఫర్వాలేదు కూర్చో'' అన్నాడు.

ఆమె ఇబ్బంది పడుతూనే కూర్చుంది.

''ఏమిటి ప్రాబ్లమ్?'' అడిగాడు ఇన్స్పెక్టర్.

''నాకు ప్రాణభయం వుంది సార్!'' అన్నది.

''ప్రాణ భయమా? ఎవరి వల్ల?''

''నా అన్న వల్లనే''

''ఏమిటి కారణం? మీ అన్న నిన్ను ఎందుకు చంపాలనుకుంటున్నాడు?''

''మా నాన్న 1992లో నగరం శివారులోని నల్లగండ్లలో మూడు వందల గజాల స్థలం కొన్నారు. ఆయన చనిపోయారు. మా అన్నకి నాకూ సమానంగా స్థలం రావాలి గదా?''

''అక్కేడే పేచీ వచ్చింది. ఇప్పుడు ఆ స్థలం విలువ పెరిగింది. అమ్మేయడానికి బేరం పెట్టాడు. ఇంటికి ఫోన్ కాల్స్ వస్తోంటే ఆ విషయం తెలుసుకున్నాను. నేను మా అన్నను నిలదీశాను.అమ్మేసి ఆ డబ్బుతో కొంత పెట్టి నాకు పెళ్లి చేస్తానన్నాడు. ఇప్పట్లో నాకుపెళ్లిచేసుకోవడం ఇష్టం లేదు. సగం డబ్బు నాకు కావాలి. బ్యాంక్‌లో వేసుకుంటానని పట్టుబట్టాను. అది మా అన్నావదినలకు ఇష్టం లేదు. నన్ను చంపాలని చూస్తున్నారు. నాకు ఏదైనా హాని జరిగితే అది మా అన్నవల్లనేనని మీరు తెలుసుకోవాలి'' చెప్పింది అన్నపూర్ణ.

''సరే! అదంతా రాసివ్వు. అడ్రస్ కూడా రాయి'' అన్నాడు ఇన్స్పెక్టర్.

అన్నపూర్ణ కాగితం మీద రాసి సంతకం పెట్టి ఇచ్చింది.

''నేను మీ అన్నను పిలిచి వార్నింగ్ ఇస్తాను. నీకేం భయం లేదు'' అని అభయం ఇచ్చాడు ఇన్స్పెక్టర్.

అన్నపూర్ణ నమస్కారం చేసి వెళ్లిపోయింది.

తర్వాత సెంట్రీ లోపలకు వచ్చాడు.

''సార్! లంచ్ తెమ్మంటారా?'' అని అడిగాడు.

ఇన్స్పెక్టర్ వాచీలో టైం చూసుకున్నాడు. సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట.

★★★

లంచ్ చేసిన తర్వాత ఎస్ఐ రాఘవని పిలిచాడు ఇన్స్పెక్టర్ సలీంఖాన్.

''ఈ అడ్రస్‌లో గోపీకృష్ణ అనే వాడుంటాడు. వాడు తన చెల్లెలు అన్నపూర్ణని చంపపడానికి ప్రయత్నిస్తున్నాడని కంప్లయింట్ వచ్చింది. వాడిని తీసుకుని రా! వార్నింగ్ ఇద్దాం'' అన్నాడు.

ఎస్ఐ రాఘవ పోలీస్ వ్యాన్ తీసుకొని గోపీకృష్ణను తీసుకురావడానికి వెళ్లాడు.

ఆ ఇల్లు అమీర్‌పేటలో వుంది. అడ్రస్ కనుక్కొని వెళ్లేసరికి ఇంటి ముందు జనం గుమిగూడి వున్నారు. పోలీస్ వ్యాన్ చూసి ఒక ముసలాయన వచ్చాడు.

''గోపీకృష్ణ వున్నాడా?'' అని ఎస్ఐ అడిగాడు.

''లేదు సార్! వాడి చెల్లెలికి యాక్సిడెంటయింది. చనిపోయిందని కబురు వచ్చింది. వెళ్లాడు'' చెప్పాడు.

''యాక్సిడెంట్ ఎక్కడయింది?''

''అమీర్‌పేటలో''

''మీరెవరు?''

''నా పేరు శివలింగం. గోపీకృష్ణ నా అల్లుడు.''

''మై గాడ్''అనుకొని వ్యాన్ ఎక్కికూర్చున్నాడు ఎస్ఐ రాఘవ.

ఎస్ఐ రాఘవ చెప్పింది విని అదిరిపడ్డాడు ఇన్స్పెక్టర్ సలీంఖాన్.

''ఆ అమ్మాయి సరిగ్గా ఒంటిగంటకు మన స్టేషన్‌లోనే వుంది. అమీర్‌పేట ఎప్పుడు వెళ్లింది? యాక్సిడెంట్ ఎప్పుడైంది?'' అన్నాడు.

''గమ్మత్తుగా వుంది సార్!'' అన్నాడు ఎస్ఐ

ఇన్స్పెక్టర్ ఆ ఏరియా పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

''నేను ఇన్స్పెక్టర్ సలీంఖాన్‌ని మాట్లాడుతున్నాను. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ నుంచి అమీర్‌పేటలో ఇరవై ఏళ్ల అమ్మాయి యాక్సిడెంట్‌లో చనిపోయిందని తెలిసింది. ఆమె పేరు ఏమిటి? యాక్సిడెంట్ ఎన్ని గంటలకు జరిగింది. వివరాలు కావాలి'' అన్నాడు.

''సార్! ఆమె పేరు అన్నపూర్ణ. కూకట్‌పల్లి, బాగ్ అమీరీలో ఇంటి నెంబర్లో వుంటుంది. అమీర్‌పేటలో గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకోవడానికి వస్తూ వుంటుంది.

''యాక్సిడెంట్ ఎన్నిగంటలకు జరిగింది? ఎలా?''

''సరిగ్గా పన్నెండు గంటలకు యాక్సిడెంట్ జరిగింది సార్! అంబాసిడర్ కారు గుద్దింది.''

''శవం ఎక్కడుంది?''

''ఉస్మానియాకి పోస్ట్‌మార్టమ్ కోసం పంపించాం.''

ఇన్స్పెక్టర్ సలీంఖాన్ అయోమయంలో పడిపోయాడు. తన దగ్గరకు ఒంటిగంటకు వచ్చిన అమ్మాయి, గంటక్రితమే ఎలా చనిపోతుంది? అంతా మిస్టరీగా వుందే?అనుకున్నాడు.

పోనీ తన దగ్గరకు వచ్చిన అమ్మాయి వేరే అమ్మాయి కూడా కాదని వివరాలు తెలుస్తున్నాయి. ఆమె ఇచ్చిన అడ్రస్, యాక్సిడెంట్‌లో చనిపోయిన అమ్మాయి ఇంటి అడ్రస్ ఖచ్చితంగా ఒక్కరే. ఆమె పేరు గూడా అన్నపూర్ణే.

ఈ మిస్టరీ ఏమిటో ఛేదించాలి అనుకున్నాడు సలీంఖాన్.

బాగ్ అమీరీలో గోపీకృష్ణ ఇంటి దగ్గర మఫ్టీలో ఒక కానిస్టేబుల్‌ని వుంచి, శవం తీసుకొచ్చిన తరువాత ఫోన్ చెయ్యమన్నాడు.

సాయంకాలం ఆరుగంటలకు కానిస్టేబుల్ ఫోన్ చేశాడు.

''సార్! శవం తీసుకొచ్చారు.''

సలీంఖాన్ బాగ్ అమీరీ వెళ్లి చూశాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు. యాక్సిడెంట్‌లో చనిపోయిన అన్నపూర్ణ తన దగ్గరకు వచ్చిన అన్నపూర్ణ ఒకటి కాదు.

తన దగ్గరకు వచ్చిన అన్నపూర్ణ ఎవరు?

ఇన్స్పెక్టర్ గోపీకృష్ణను ఏమీ ప్రశ్నించకుండానే స్టేషన్‌కి తిరిగి వచ్చేశాడు.

★★★

మర్నాడు గోపీకృష్ణను స్టేషన్‌కి పిలి



''సార్! శవం తీసుకొచ్చారు.'' సలీంఖాన్ బాగ్ అమీరీ వెళ్లి చూశాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు. యాక్సిడెంట్‌లో చనిపోయిన అన్నపూర్ణ తన దగ్గరకు వచ్చిన అన్నపూర్ణ ఒకటి కాదు. తన దగ్గరకు వచ్చిన అన్నపూర్ణ ఎవరు?

పించాడు ఇన్స్‌పెక్టర్ సలీంఖాన్.

''సార్ త్వరలోనే మా చెల్లెలి పెళ్లి చేద్దామనుకున్నాను. ఈ లోపలే ఈ ఘోరం జరిగిపోయింది'' కన్నీళ్లు తుడుచుకున్నాడు గోపీకృష్ణ.

''దొంగ ఏడుపులు మాని నిజం చెప్పు? నల్లగండ్లలో వున్న స్థలం అమ్మనీయకుండా అడ్డుపడుతుందనేగా మీ చెల్లెల్ని మర్డర్ చేయించావు?''

ఇన్స్‌పెక్టర్ అడిగింది విని పక్కలో బాంబు పడ్డట్టు వులిక్కిపడ్డాడు.

''సార్! మీకెవరో తప్పుడు సమాచారం ఇచ్చారు. నా చెల్లెల్ని నేనెందుకు చంపిస్తాను. నా చెల్లెలంటే నాకెంతో ప్రేమ. మా బజార్లో ఎవర్నడిగినా ఈ సంగతి చెప్తారు.'' తేరుకొని అన్నాడు గోపీకృష్ణ.

''చెల్లెలు కంటే డబ్బు మీద నీకు ఇంకా ప్రేమ'' వ్యంగంగా అన్నాడు ఇన్స్‌పెక్టర్.

''నన్ను నమ్మండి సార్! నేనీ హత్య చేయించలేదు. యాక్సిడెంట్ జరిగింది'' అన్నాడు గోపీకృష్ణ.

''మిస్టర్ గోపీకృష్ణ! మా మర్యాదలు రుచి చూడక ముందే నిజం చెప్తే మంచిది. మూడు రోజుల క్రితమే నీ చెల్లెలు మా స్టేషన్‌కు వచ్చి నీ మీద కంప్లయింట్ ఇచ్చింది. తనకు ప్రాణ భయం వుందనీ, తన అన్న హత్యా ప్రయత్నం చేస్తాడనీ రాసిచ్చింది. అన్నాడు ఇన్స్‌పెక్టర్.

గోపీకృష్ణ ముఖం వెలవెలా పోయింది.

''నేను మాటవరసకు చెప్పింది వినకపోతే చంపుతా'' అన్నానుసార్! నా మీద కంప్లయింట్ ఇస్తుందనుకోలేదు'' అన్నాడు.

''అనుకోనివే జరుగుతాయి మిస్టర్. నీకు అడ్డుపడుతుందని నీ చెల్లెల్ని చంపాలని నిర్ణయించుకొన్నావు. అటు ఆస్తి దక్కుతుంది, ఇటు ఆమె పేరుతో వున్న ఇన్స్యూరెన్స్ డబ్బు వస్తుందనీ! ఒక దెబ్బకు రెండు పిట్టలురాల్తాయని ప్లాన్ వేశావు. కానీ నువ్వే రాలిపోయే పరిస్థితి వచ్చింది. అనవసరంగా కాలయాపన చెయ్యకు. నిజం ఒప్పుకో'' కఠినంగా అన్నాడు ఇన్స్‌పెక్టర్.

గోపీకృష్ణ ఏదో చెప్పబోతుండగా, యాక్సిడెంట్ చేసిన డ్రైవర్ హసన్‌ని ఇన్స్‌పెక్టర్ ముందు నిలబెట్టారు కానిస్టేబుల్స్.

డ్రైవర్ని చూడగానే వణికిపోయాడు గోపీకృష్ణ. డ్రైవర్ బాగా దెబ్బలు తిని మూలుగుతున్నాడు. అప్పటికే బాగా పోలీస్ మర్యాదలు చేశారనీ, వాడు నిజం చెప్పి వుంటాడనీ గ్రహించేశాడు గోపీకృష్ణ.

''వీడి చెల్లెల్ని యాక్సిడెంట్ చేసి చంపితే లక్ష రూపాయలు ఇస్తానన్నాడు సార్ గోపీకృష్ణ. నేనపు సమయం చూసి యాక్సిడెంట్ చేశాను. డబ్బు కోసమే చేశాను సార్'' ఏడుపు ఆపుకుంటూ నిజం చెప్పాడు డ్రైవర్.

''ఇప్పుడేమంటావురా బద్మాష్!'' అని బూట్ కాలితో ఎగిరి తన్నాడు ఇన్స్‌పెక్టర్.

గోపీకృష్ణ వెల్లకిలా పడిపోయాడు.

''నిజమే సార్! నేనే హత్య చేయించాను. ఒప్పుకుంటున్నాను. నన్ను కొట్టకండి సార్!'' అన్నాడు గోపీకృష్ణ రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెడుతూ...

''వీడిని సెల్లో తోయండి'' అన్నాడు ఇన్స్‌పెక్టర్ కోపంతో..

★★★

మర్నాడు న్యూస్ పేపర్లలో 'చెల్లెల్ని హత్య చేయించిన అన్న' అనే హెడ్డింగ్‌తో అన్నపూర్ణ హత్య వార్త పడింది. అదే పేజీలో 'ఆమె ఎవరు?' అని బాక్స్ ఐటమ్ అందర్నీ ఆకర్షించింది.

అన్నపూర్ణ అనే అమ్మాయి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కి వచ్చి తనకు అన్న వలన ప్రాణ భయం వుందని మధ్యాహ్నం కంప్లయింట్ ఇచ్చిందనీ, కానీ పన్నెండు గంటలకే అమీర్‌పేట చౌరస్తాలో కారు యాక్సిడెంట్‌కు గురై చనిపోయిందనీ ఇదెలా సాధ్యం? ఇందులో మిస్టరీ ఏమిటి? అని అచ్చుపడింది.

హత్యానేరం మీద డ్రైవర్ హసన్, గోపీకృష్ణలు జైలుపాలయ్యారు.

నెలరోజుల తర్వాత కూకట్‌పల్లిలో ఒక షోరూమ్ ప్రారంభించడానికి సినిమా తారలు వస్తున్నారు. బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఇన్స్‌పెక్టర్ సలీంఖాన్‌కి యాదృచ్ఛికంగా జనంలో ముందు వరసలో నిల్చున్న అన్నపూర్ణ కనిపించింది.

ఇన్స్‌పెక్టర్ కానిస్టేబుల్‌కి ఆమెను చూపించి పోలీస్ వ్యాన్ దగ్గరకి తీసుకురమ్మన్నాడు.

ఆమె భయపడుతూ వచ్చి పోలీస్ వ్యాన్ పక్కన నిల్చుంది.

''నీ పేరు అన్నపూర్ణ కదూ?'' అడిగాడు ఇన్స్‌పెక్టర్.

''కాదు సార్! సుజన''

''నువ్వే కదా నెల క్రితం పోలీస్ స్టేషన్‌కి వచ్చి నేను అన్నపూర్ణననీ, నాకు మా అన్న వలన ప్రాణ భయం వుందనీ కంప్లయింట్ రాసిచ్చావు?''

ఆమె కానని తలూపింది.

''ఎందుకు అలా చేశావు?''

''అన్నపూర్ణ నా క్లోజ్ ఫ్రెండ్ సార్! అన్ని విషయాలు నాకు చెప్పుండేది. పోలీస్ కంప్లయింట్ ఇద్దామని నేను అంటే తనకు భయం అన్నది. తను పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు ఎవరైనా చూస్తారని బిడియపడింది.''

''ఆమెను నువ్వు వెంటబెట్టుకొని రావొచ్చుగా?''

''ఎంత చెప్పినా వినలేదు. మీకు అన్నపూర్ణ అంటే ఎవరో తెలిసే అవకాశం లేదు కనుక నేనే అన్నపూర్ణని మీకు కంప్లయింట్ రాసిచ్చాను. మీరు ఆమె అన్నను పిలిపించి మందలిస్తారనీ, అతను హత్య చేయించడానికి భయపడతాడనీ అనుకున్నాను. కానీ ఇంత ఘోరం ముందే జరుగుతుందని అనుకోలేదు.''

''నువ్వు ఆమె పేరుతో కంప్లయింట్ ఇచ్చినా ఆ తర్వాతనైనా తన చెల్లెలు ఇచ్చిందని అతనికి తెలుస్తుందిగా? చెల్లెల్ని నిలదీసేవాడేగా?''

''నేను మీకు కంప్లయింట్ ఇచ్చిన తర్వాత వెళ్లి ఇలా చేసానని అన్నపూర్ణకు చెప్పాలనుకున్నా సార్! ఆ అవకాశం లేకుండా పోయింది.'' అని కళ్లు తుడుచుకుంది సుజన.

''ఏసీ హా! నువ్వా కంప్లయింట్ ఇచ్చి మంచి పనే చేశావు. దాని ఆధారంగానే హంతకుల్ని పట్టుకోగలిగాం'' అని ఆమెను మెచ్చుకున్నాడు ఇన్స్‌పెక్టర్.

★

